ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రంగారెడ్డి
5 జిల్లా వార్తలు
బుధవారం 7 మే 2025

ఉష్ణోగ్రత
గరిష్ఠం 39.6
కనిష్ఠం 19.3


మీర్‌పేటలోని క్యాంపు కార్యాలయం వద్ద బీఆర్ఎస్ శ్రేణుల సంబురాలు

సబితకు భారీ ఉపశమనం

- ఓబుళాపురం కేసులో నిర్దోషిగా కోర్టు తీర్పు
- దశాబ్దంన్నరగా రాజకీయ ఒడిదుడుకులు
- అభిమానులు, బీఆర్ఎస్ శ్రేణుల సంబరాలు



(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి): మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డికి భారీ ఉపశమనం లభించింది. ఓబుళాపురం మైనింగ్ కేసులో అభియోగాలు ఎదుర్కొంటున్న ఆమెకు మంగళవారం సీబీఐ కోర్టు క్లీన్‌చిట్ ఇచ్చింది. దాదాపు 15 ఏళ్లకుపైగా నడిచిన ఈ కేసులో సబితారెడ్డిపై 12 ఏళ్ల కిందట అభియోగాలు నమోదయ్యాయి. ఈ కేసులో ఏ-9గా ఉన్న ఆమెను నిర్దోషిగా ప్రకటిస్తూ న్యాయస్థానం ఇచ్చిన తీర్పుతో ఆమె వర్గీయులు సంబరాలు జరుపుకున్నారు. ఈ కేసు సబితారెడ్డి రాజకీయ భవిష్యత్తుపై తీవ్ర ప్రభావాన్ని చూపించింది. గనులశాఖ మంత్రిగా ఉన్న సమయంలో ఓబుళాపురంలో గాలి జనార్దన్‌రెడ్డి, ఇతరులకు ప్రయోజనాలు కల్పించారంటూ వచ్చిన అభియోగాలపై సీబీఐ విచారణ జరపడం, న్యాయస్థానం విచారణ చేపట్టడం చకచకా జరిగాయి.

పదవికి రాజీనామా..

ఆమె హోంమంత్రిగా ఉన్న సమయంలో కేసు నమోదుకావడంతో తనపదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది. ఓబుళాపురం మైనింగ్ అక్రమాలపై 2009 డిసెంబర్‌లో

మిగతా 7వ పేజీలో...

సబ్‌రిజిస్ట్రార్‌పై దాడి హేయమైన చర్య

రంగారెడ్డి అర్బన్, మే 6(ఆంధ్రజ్యోతి): పెద్ద అంబర్‌పేట సబ్ రిజిస్ట్రార్‌పై జరిగిన దాడిని జిల్లా గెజిటెడ్ అధికారుల సంఘం తీవ్రంగా ఖండించింది. దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని సభ్యులు డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్‌లో నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. నిరసన తెలిపిన వారిలో గెజిటెడ్ అధికారుల సంఘం ప్రెసిడెంట్ డాక్టర్ కె.రామారావు, సెక్రటరీ శ్రీనేష్‌కుమారి, నాయకులు వెంకటేష్, శాంతిశ్రీ, అలివేలు, లక్ష్మణ్‌స్వామి, సుజాత, సైదమ్మ, నాగేశ్వరావు, సీడీపీవో, కలెక్టరేట్ గజిటెడ్, నాన్ గజిటెడ్ ఉద్యోగులున్నారు.


కుట్టు పనులను పరిశీలిస్తున్న అధికారులు

విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి విద్యార్థులకు యూనిఫాం అందజేయాలని విద్యాశాఖ కసరత్తు ప్రారంభించింది. జిల్లాకు వస్త్రం చేరుకోగా ఎంఈవోలు, ఏపీఎంల ఆధ్వర్యంలో కుట్టే పనులు స్వయం సహాయక సంఘాల మహిళలకు అప్పగించారు. ఇప్పటికే విద్యార్థుల కొలతలు కూడా తీసుకున్నారు. మండల కేంద్రాల్లో నిర్దేశించిన మండల సమాఖ్య కేంద్రాల్లో కుట్టు పనులు మొదలయ్యాయి. ప్రతి విద్యార్థికీ కనీసం ఒక జత దుస్తులైనా ఈనెల చివరి నాటికి సిద్ధం చేయాలని సంఘాలకు అధికారులు లక్ష్యం నిర్దేశించారు. పాఠశాలలు పునఃప్రారంభం రోజు విద్యార్థులు నూతన దుస్తులతో హాజరయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు.

సిద్ధమవుతున్న

యూనిఫాం

- పక్కా కొలతలతో ఏకరూప దుస్తుల తయారీ
- ఈ నెలాఖరు వరకు ఒక జత సిద్ధం
- బడులు తెరిచేనాటికి పంపిణీకి సన్నాహాలు

జిల్లాకు చేరుకున్న వస్త్రం.. చకచకా కుట్టు పనులు



రంగారెడ్డి అర్బన్, మే 6(ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్షా అభియాన్ ద్వారా ప్రభుత్వం ప్రతి సంవత్సరం ఒక్కో విద్యార్థికి రెండు జతల యూనిఫామ్స్ అందజేస్తుంది. 2025-26 సంవత్సరానికి కుట్టు పనిని పూర్తిగా మహిళా సంఘాలకు అప్పగించింది. ప్రభుత్వం యూనిఫాం వస్త్రాన్ని మహిళా సంఘాలకు అప్పగించింది. ఎంపిక చేసిన సభ్యులు యూనిఫాం వస్త్రం రాకముందే ఆయా పాఠశాలలకు వెళ్లి విద్యార్థుల కొలతలను తీసుకున్నారు. అయితే వస్త్రం సరఫరాలో ప్రభుత్వం ఆలస్యం చేయడంతో ముందుగా ఒక్కో విద్యార్థికి ఒక జత యూనిఫాం అందించేందుకు జిల్లా అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. జిల్లా అధికారులు యూనిఫాం దుస్తుల తయారీని పరిశీలించి సకాలంలో అందించాలని మండలాల వారీగా లక్ష్యాన్ని నిర్దేశించారు. ఇప్పటికే కొన్నింటిని పూర్తి చేయగా ఈనెలాఖరు వరకు మిగతావి పూర్తి కానున్నాయి. జిల్లాలో ప్రభుత్వ, స్థానిక సంస్థలు, కస్తూర్బా, తెలంగాణ మోడల్ పాఠశాలలు

మిగతా 8వ పేజీలో...

జిల్లాలో ప్రయోజనం పొందే విద్యార్థులు

పాఠశాలలు	1,341
విద్యార్థులు	1,38,969
బాలురు	66,792
బాలికలు	72,177
జిల్లాకు చేరుకున్న వస్త్రం (మీటర్లలో)	5,94,751

సమాచారం

దత్తతకు సిద్ధంగా బాల బాలికలు

జిల్లా శిశు సంక్షేమాధికారి శ్రీలత

రంగారెడ్డి అర్బన్, మే 6(ఆంధ్రజ్యోతి): దత్తతకు బాలబాలికలు సిద్ధంగా ఉన్నారని జిల్లా శిశు సంక్షేమాధికారి శ్రీలత మంగళవారం ప్రకటనలో తెలిపారు. మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిశుగృహ, బాలల సంరక్షణ కేంద్రాల్లో రక్షణ, సంరక్షణ కోసం 12 మంది బాలికలు, ఇద్దరు బాలురు ఉన్నట్లు పేర్కొన్నారు. (కె. సాయికుమార్ (15), కె.కార్తిక్ (8) కె.దివ్య(8), సౌజన్య(8), అనుష(13), శృతి వంశీ(10), సాయి గణేష్(16), వి.చందన(16), విచిత్ర(7), కురుణ దీప(16), శాలిని(11), రక్షిత(7), స్వప్న(10), నందిని(11) ఉన్నట్లు వివరించారు. ఈ పిల్లలకు జన్మనిచ్చిన తల్లిదండ్రులు, సంబంధికులు ప్రతికల్లో వచ్చిన న్యూస్ తర్వాత 30 రోజుల్లోగా తగిన సాక్షాధారాలతో సహా జిల్లా సంక్షేమాధికారిని సంప్రదించాలని, లేదంటే ఈ పిల్లలను అనాథలుగా ప్రకటించి, ప్రభుత్వం నిర్ధేశించిన నియమ నిబంధనల ప్రకారం దత్తత ఇస్తామని తెలిపారు. ఆసక్తిగల వారు దత్తత కోసం రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు.

నేడు కొత్తూరుకు మంత్రి శ్రీధర్‌బాబు రాక

కొత్తూర్/నందిగామ, మే 6 (ఆంధ్రజ్యోతి): కొత్తూర్, నందిగామ మండలాల్లో నాట్కో ట్రస్టు ఆధ్వర్యంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులను ప్రారంభించేందుకు ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ బుధవారం వస్తున్నారని నాట్కో ట్రస్టు సభ్యులు మంగళవారం ప్రకటనలో తెలిపారు. కొత్తూర్ మండల కేంద్రంలో దాదాపు రూ.రెండు కోట్లతో నూతనంగా నిర్మించిన ఉన్నత పాఠశాల భవనం, నందిగామ మండలంలోని నందిగామ, తాటిగడ్డతండా, సంఘీగూడ గ్రామాల్లో నిర్మించిన అంగన్‌వాడీ భవనాలు, మేకగూడలో నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాలను మంత్రి ఎమ్మెల్యేతో కలిసి ప్రారంభిస్తారని పేర్కొన్నారు. ఉదయం 9 గంటల నుంచి 10 గంటల వరకు మంత్రి కొత్తూర్, నందిగామ మండలాల్లో పర్యటించి అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటారని తెలిపారు.

దారి కొచ్చేనా?

నిలిచిన మీర్‌ఖాన్‌పేట - యాచారం రోడ్డు నిర్మాణం

- రూ.78 కోట్లతో పనులు.. పెండింగ్‌లో రూ.20 కోట్ల బిల్లులు
- పనుల నుంచి తప్పుకున్న కాంట్రాక్టర్
- మూడున్నరేళ్లుగా దుమ్మురేగుతున్న రోడ్డు
- ఇబ్బందులు పడుతున్న స్థానికులు, వాహనదారులు


దుమ్ము రేగుతున్న మీర్‌ఖాన్‌పేట - యాచారం రోడ్డు

యాచారం, మే 6(ఆంధ్రజ్యోతి): సకాలంలో బిల్లులు అందక రోడ్డు విస్తరణ పనులు నిలిచిపోయాయి. గత ప్రభుత్వ హయాంలో ఫార్మాసిటీ కోసం రోడ్డు పనులు చేపట్టారు. మీర్‌ఖాన్‌పేట బ్రిడ్జి నుంచి యాచారం మండల కేంద్రం వరకు రూ.78కోట్ల నిధులతో చేపట్టిన 14 కిలో మీటర్ల రోడ్డు విస్తరణ పనులు మూడున్నరేళ్లుగా ముందుకు సాగడం లేదు. అయినా ఆర్అండ్‌బీ శాఖ అధికారులు పత్తా లేకుండాపోయారు. కొన్ని నెలల క్రితం కొత్తగా బాధ్యతలు చేపట్టిన ఆర్అండ్‌బీ డీఈ సైతం అసంపూర్తిగా ఉన్న రోడ్డు పనులను పరిశీలించకపోవడం విశేషం. అలాగే నందివనపర్తి నుంచి మేడిపల్లి వరకు రూ.48 కోట్ల నిధులతో చేపట్టిన మూడు కిలోమీటర్ల రోడ్డు పనులు సైతం బిల్లులు అందక నిలిచిపోయాయి.

దుమ్ముతో తప్పని తిప్పలు

బీఆర్ఎస్ హయాంలో మీర్‌ఖాన్‌పేట బ్రిడ్జి నుంచి యాచారం మండల కేంద్రం వరకు రూ.78 కోట్లతో నాలుగు లేన్ల

మిగతా 8వ పేజీలో...

త్వరగా పూర్తి చేయాలి



మూడున్నరేళ్లుగా బీటీ రోడ్డును పాడు చేసి మట్టిరోడ్డుగా మార్చారు. రోడ్డుపై వాహనాలు వెళ్లే క్రమంలో వచ్చే దుమ్ముధూళి కోళ్లఫాంపై, దాణాపై పడుతుండడంతో కోళ్లు చనిపోతున్నాయి. మా పశువుల దాణాపై దుమ్ము పడడంతో అవి తినడం లేదు. దుమ్ముపడిన పచ్చిగడ్డిని మేస్తే పశువులు రోగాల బారిన పడుతున్నాయి. అధికారులు గుర్తించి త్వరగా రోడ్డు పనులను పూర్తి చేయాలి.

- శ్రీశైలం, బాయిలర్ కోళ్లఫాం రైతు, నజ్దిక్‌సింగారం


అజీజ్‌నగర్‌లో అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న రెవెన్యూ సిబ్బంది

ఆక్రమణల కూల్చివేత

మొయినాబాద్ రూరల్, మే 6(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ శివారు మొయినాబాద్ మండలంలోని అజీజ్‌నగర్, చిలుకూరు రెవెన్యూ పరిధిలో రూ.కోట్లు విలువ చేసే ప్రభుత్వ భూమిని కబ్జాచెర నుంచి రెవెన్యూ అధికారులు కాపాడారు. అక్కడ కట్టిన తాత్కాలిక నిర్మాణాలను కూల్చివేశారు. ప్రభుత్వ భూములను కబ్జా చేస్తే ఎంతటి వారినైనా వదిలే ప్రసక్తే లేదని, క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని మొయినాబాద్ తహసీల్దార్ గౌతమ్‌కుమార్ హెచ్చరించారు. మండల పరిధిలోని చిలుకూరు శివారులోని సర్వే 457లోని శిఖంలో కొందరు అక్రమంగా షెడ్డు నిర్మించారు. రెవెన్యూ సిబ్బంది మంగళవారం అక్కడికి చేరుకొని కూల్చివేశారు. అంతేకాకుండా ఓ ప్రైవేటు ఫాంహౌస్‌కు అక్రమంగా రోడ్డు వేయగా దానిని కూడా తొలగించారు. అజీజ్‌నగర్ శివారులో సర్వే నంబర్ 49లోని ప్రభుత్వ భూమిలో రెండు గదులు నిర్మించగా వాటిని తొలగించారు. పోలీసుల బందోబస్తు మధ్య ఈ కూల్చివేతలు చేపట్టారు. కార్యక్రమంలో ఆర్ఐ రోజా, అదనపు ఆర్ఐ రాజేష్, తదితరులున్నారు.


ఎల్లమ్మతండాలో ఉపాధిహామీ కూలీలతో మాట్లాడుతున్న జాన్‌వెస్లీ

ఉపాధి హామీ చట్టాన్ని కాలరాస్తున్నారు

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

మంచాల, మే 6(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధిహామీ చట్టాన్ని కాలరాస్తూ కూలీల జీవితాలతో చెలగాటమాడుతున్నాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ ఆరోపించారు. మంగళవారం మండల పరిధిలోని ఎల్లమ్మతండాలో కొనసాగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించారు. కూలీలతో సమావేశమై సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోరాటాలతో సాధించుకున్న కార్మిక చట్టాలను కాలరాస్తూ కేంద్ర ప్రభుత్వం లేబర్‌కోడ్‌ను తీసుకొస్తుందన్నారు. ఉపాధి హామీ పనులకు ప్రభుత్వం రూ.2.5 లక్షల కోట్లు కేటాయించాల్సి ఉండగా కేవలం రూ.86 వేల కోట్లతో సరిపెట్టిందని ఆరోపించారు. కొలతలతో నిమిత్తం లేకుండా ఏడాదిలో 200 రోజులు పనిదినాలు కల్పించి దినసరి కూలీ రూ.600కు పెంచాలని కోరారు. ఉపాధిహామీ సిబ్బందికి అందాల్సిన నాలుగు నెలల పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం పార్టీ జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య మాట్లాడుతూ ఉపాధిహామీ పథకంలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 30న తలపెట్టిన చలో కలెక్టరేట్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి పి.యాదయ్య, మండల కార్యదర్శి రావుల జంగయ్య, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు సామేల్, జగదీశ్, ఈ.నర్సింహ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.అంజయ్య, కె.జగన్, జిల్లా కమిటీ సభ్యులు కర్నాటి శ్రీనివాస్‌రెడ్డి, శ్యాంసుందర్, పి.జగన్, బుగ్గ రాములు, కాళ్ల జంగయ్య, ఆవుల యాదయ్య, బోయపల్లి సుధాకర్, సపావట్ వెంకటేశ్, మంథని జంగయ్య, నోముల జంగయ్య, వినోద్‌కుమార్, జోగు శేఖర్, బి.విజయ్ పాల్గొన్నారు.


వేసవి శిక్షణ శిబిరంలో విద్యార్థులతో మట్లాడుతున్న డీఈవో సుశీంద్రరావు

విద్యాభివృద్ధికి దోహదపడాలి

డీఈవో సుశీంద్రరావు

కొత్తూర్, మే 6 (ఆంధ్రజ్యోతి): విద్యాభివృద్ధికి ఉపాధ్యాయులు దోహదపడాలని జిల్లా విద్యాశాఖాధికారి సుశీంద్రరావు సూచించారు. స్థానిక ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాన్ని మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వేసవి శిక్షణ శిబిరంలో కల్పించిన ఏర్పాట్ల గురించి ఉపాధ్యాయులు, విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి శిక్షణ శిబిరాలతో విద్యార్థులు నైపుణ్యం సాధిస్తారన్నారు. కొత్తూర్‌లో నాట్కో ట్రస్టు ఆధ్వర్యంలో అత్యాధునిక హంగులతో నూతనంగా నిర్మించిన ఉన్నత పాఠశాలను బుధవారం ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు ప్రారంభించనుండడంతో ఆ ఏర్పాట్లపై ఎంఈవో అంగోర్‌నాయక్‌ను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో స్థానిక మున్సిపల్ కమిషనర్ బాలాజీ, ఉపాధ్యాయులు రాజు, మనోజ్, పీడీ నవనీత తదితరులు పాల్గొన్నారు.

భూ భారతిని సద్వినియోగం చేసుకోవాలి

కలెక్టర్ నారాయణరెడ్డి


రైతుల భూసమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ నారాయణరెడ్డి, పక్కన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

చౌదరిగూడ, మే 6(ఆంధ్రజ్యోతి): భూభారతి చట్టాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. మంగళవారం కొందుర్గు మండలం శ్రీరంగాపూర్, ఉత్తరాసపల్లిలో కొనసాగుతున్న భూభారతి రెవెన్యూ సదస్సులను షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌లతో కలిసి పరిశీలించారు. అనంతరం రైతుల నుంచి వచ్చిన అర్జీల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. భూ సమస్యల పరిష్కారం కోసం వచ్చిన అర్జీలను స్వీకరించి సత్వరమే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఉత్తరాసపల్లిలో మహేందర్ అనే రైతు సర్వే చేయాలని అధికారులను కోరాడంతో స్పందించిన కలెక్టర్ సర్వే కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. భూ సమస్యలున్న రైతులు గ్రామాల్లో నిర్వహించే రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో షాద్‌నగర్ ఆర్డీవో ఎన్ఆర్ సరిత, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్, తహసీల్దార్లు జగదీశ్వర్, రమేష్‌కుమార్, రెవెన్యూ సిబ్బంది రాకేష్, శివకుమార్, శ్రీనివాస్‌రెడ్డి, మహేందర్‌గౌడ్, ప్రకాష్, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సయ్యద్ సాదిక్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కృష్ణారెడ్డి, రోహిత్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి, గోవర్ధన్‌గౌడ్, మల్లేషగౌడ్, జహంగీర్, రాములుగౌడ్, మహేందర్ గౌడ్, మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.



నిరుపయోగంగా నీటి ట్యాంకులు

- కొన్నేళ్ల క్రితం నిర్మాణం..
- నేడు పనికిరాని వైనం
- పట్టించుకోని అధికారులు

8

10 నుంచి లక్ష్మీనృసింహుడి జయంతి ఉత్సవాలు

ముస్తాబవుతున్న ఆలయం

7

బషీరాబాద్ సీహెచ్‌సీ నిర్మాణానికి అడుగులు

- రోగులకు అందనున్న మెరుగైన వైద్యం
- సిబ్బందికి, ప్రజలకు తొలగనున్న ఇక్కట్లు


సీహెచ్‌సీ భవన నిర్మాణానికి తీసిన పునాదులు

బషీరాబాద్, మే 6(ఆంధ్రజ్యోతి): బషీరాబాద్ మండల కేంద్రంలో సీహెచ్‌సీ(కమ్యూనిటీ హెల్త్ సెంటర్) నూతన భవన నిర్మాణానికి అడుగులు పడుతున్నాయి. ఈ ఆసుపత్రి భవన నిర్మాణానికి ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని రూ.10కోట్ల నిధులు మంజూరు చేయించారు. దీంతో పనులు ప్రారంభమయ్యాయి. ఏడాది కిందట ఇక్కడి 10పడకల పీహెచ్‌సీని 30పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేయించి, ఆసుపత్రిలో మెరుగైన వైద్యం అందేలా ఎమ్మెల్యే కృషి చేశారు. ఈ ఆసుపత్రిలో డాక్టర్లు, స్టాఫ్ నర్సులతో పాటు ఎంపీహెచ్‌ఏ, ల్యాబ్ టెక్నీషియన్ తదితర పోస్టుల నియామకానికి సైతం ఎమ్మెల్యే చొరవ తీసుకుని భర్తీ చేయించారు. కాగా ఈ ఆసుపత్రి నూతన భవనం నిర్మాణం పూర్తయితే మండల ప్రజలకు వైద్యసేవలు మెరుగుపడనున్నాయి. 24గంటల అత్యవసర సేవలతో పాటు పలు రకాల వైద్య సేవలు ప్రజలకు అందుబాటులోకి వస్తాయి. గైనకాలజిస్ట్, ఆర్థోపెడిక్, ప్రసూతి వైద్యంతో పాటు కంటి పరీక్షలు, శస్త్రచికిత్సలు, ల్యాబొరేటరీ, స్కానింగ్, ఎక్స్‌రే, ఈసీజీ, రక్త, మూత్ర ల్యాబ్‌లు, పోస్టుమార్టం వంటి సౌకర్యాలు రోగులకు చేరువకానున్నాయి. ఓపీ సేవలతో పాటు గర్భిణుల సేవలు పెరుగుతాయి. ప్రస్తుత పీహెచ్‌సీ భవనంలోనే సీహెచ్‌సీ ఆసుపత్రి అసౌకర్యాల మధ్య కొనసాగుతోంది. దీంతో వైద్యులు, సిబ్బంది, రోగులకు ఇబ్బందులు తప్పడం లేదు.

ఉద్యోగ, ఉపాధికి ప్రభుత్వం పెద్దపీట


ఎంపీ రవికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న శ్రీనివాస్‌గౌడ్, కేశవులు, శంకర్

ఆమనగల్లు, మే6(ఆంధ్రజ్యోతి): యువతకు ఉద్యోగాలు, ఉపాధి కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పకడ్బందీ చర్యలు తీసుకుంటోందని నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి అన్నారు. ఆమనగల్లు, కడ్తాల మండలాల్లో మంగళవారం రవి పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మైసిగండి వద్ద పీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, మార్కెట్ మాజీ వైస్‌చైర్మన్ గుర్రం కేశవులు పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఎంపీకి అందజేశారు. హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిని నాలుగు లేన్లకు విస్తరించేలా కేంద్ర ప్రభుత్వంపై మాట్లాడాలని కోరారు. ఈ రహదారిపై వాహనాల రద్దీ తీవ్రమై రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయని, తరుచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని తెలిపారు. మైసిగండిలో ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటు చేయించాలని, కడ్తాలలో 30పడకల ఆసుపత్రి ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమస్యలపై ఎంపీ సానుకూలంగా స్పందించి స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డితో కలిసి ఆయా సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకుపోతానని హామీ ఇచ్చారు. ఉపాధి హామీలో కూలీల పనిదినాలు పెంచి పట్టణ ప్రాంతాలకూ వర్తింపచేసేలా కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని గ్రామాల నాయకులు, శ్రీనివాస్‌గౌడ్ ఎంపీకి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు శంకర్‌నాయక్, బస్సీ, తులసీరామ్‌నాయక్, చందునాయక్, రామునాయక్, మహిపాల్ రెడ్డి, అల్వాల్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, రమేశ్‌గౌడ్, తదితరులు ఉన్నారు.

గొర్రెల పంపిణీలో ప్రభుత్వ నిర్లక్ష్యం


గొర్రెల, మేకల పెంపకందారుల సంఘం నూతన కమిటీ సభ్యులు

శామీర్‌పేట, మే 6(ఆంధ్రజ్యోతి): దళారుల ప్రమేయం లేకుండా నగదు బదిలీతో రెండో విడత గొర్రెలు, మేకలను పంపిణీ చేస్తామని చెప్పి సీఎం రేవంత్‌రెడ్డి నిర్లక్ష్యం చేస్తున్నారని జిల్లా మేకల, గొర్రెల పెంపకందారుల సంఘం అధ్యక్షుడు మేకల కుమార్ ధ్వజమెత్తారు. మంగళవారం శామీర్‌పేటలో మల్లన్నగుడి వద్ద మేడ్చల్ జిల్లా గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం(జీఎంపీఎస్) మొదటి మహాసభను కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే 2లక్షల నగదు బదిలీతో గొర్రెల పథకాన్ని అమలు చేస్తామని మ్యానిఫెస్టోలో పేర్కొన్నారని తెలిపారు.ప్రభుత్వమొచ్చి ఏడాదిన్నర అవుతున్నా ఆ హామీని నెరవేర్చలేన్నారు. పశువైద్యశాలల్లో మేకలకు, గొర్రెలకు మందులు లేవని, రెండేళ్ల నట్టల నివారణ మందులనూ ఇవ్వడం లేదని విచారం వ్యక్తం చేశారు. ప్రభుత్వంలో పశుసంవర్ధక శాఖ మంత్రే లేడని, సమస్యలను ఎవరికి మొరపెట్టుకోవాలో తెలియడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా జీఎంపీఎస్ ప్రధాన కార్యదర్శి ఎక్కలదేవి కొమురయ్య, సంఘం వివిధ మండలాల నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

మండల పెంపకందారుల సంఘం నూతన కమిటీ ఎన్నిక

మహాసభ సందర్భంగా శామీర్‌పేట మండల గొర్రెల, మేకల పెంపకందారుల సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పినిగంటి కుమార్, ప్రధాన కార్యదర్శి మోతె వేణు, గౌరవాధ్యక్షుడు జహంగీర్, ఉపాధ్యక్షులు సత్యనారాయణ, రాములు, సహాయ కార్యదర్శులుగా స్వామి, గణేశ్, 21మంది కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు.

వాటర్ ప్లాంట్ ఏర్పాటు అభినందనీయం


నీటి శుద్ధి కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

చౌదరిగూడ, మే 6(ఆంధ్రజ్యోతి): ప్రజల దాహార్తిని తీర్చేందుకు దాతలు నీటిశుద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేయడం గొప్ప విషయం అని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మంగళవారం కొందుర్గు మండలం శ్రీ రంగాపూర్‌లో ఏర్పాటు చేసిన నీటిశుద్ధి కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి, ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎమ్మెల్యే సహకారంతో షాద్‌నగర్ మార్కెట్ కమిటీ మాజీ వైస్‌చైర్మన్ సాదిక్, అశోక్‌రెడ్డి వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయడం సంతోషకరం అని కలెక్టర్ అన్నారు. రూ.6.5లక్షలతో 10వేల లీటర్ల సామర్థ్యంతో వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ బాబర్ ఖాన్, నాయకులు కృష్ణారెడ్డి, గోవర్ధన్‌గౌడ్, జహంగీర్, మల్లేష్‌గౌడ్, రాములుగౌడ్, నర్సింహులు, మహేందర్‌రెడ్డి, రవిగౌడ్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి


యాలాలలో ట్యాంకర్ వద్ద నీటిని పట్టుకుంటున్న స్థానికులు

యాలాల, మే 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో తాగునీటి సమస్య పరిష్కరించాలని మంగళవారం గ్రామస్తులు, కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పలి మల్కన్న కోరారు. యాలల దళితవాడ, బీసీ వాడ, మైనార్టీ కాలనీలో వారం రోజులుగా నీరందక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాగునీటి సమస్య పరిష్కరించాలని వారు చేశారు.

రాష్ట్రంలో సైనిక పాఠశాల ఏర్పాటు చేయాలి


మాట్లాడుతున్న పీసీసీ నాయకుడు గౌరీ సతీష్

మొయినాబాద్ రూరల్, మే 6 (ఆంధ్రజ్యోతి): యువత సాయుధ దళాల్లో చేరేందుకు ఉపయోగపడే సైనిక పాఠశాలను తెలంగాణ రాష్ట్రంలో కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేయాలని పీసీసీ అధికార ప్రతినిధి గౌరీ సతీష్ డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలో ఆయన మాట్లాడుతూ.. రక్షణ శాఖ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా 33సైనిక్ పాఠశాలలున్నాయని, తెలంగాణలో మాత్రం ఒక్కటి కూడా లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో తెలంగాణ నుంచి సాయుధ దళాల్లో చేరేందుకు ఆసక్తి చూపే విద్యార్థుల కల కలగానే మిగిలిపోతోందని అన్నారు. అయితే తెలంగాణకు తొమ్మిదేళ్లక్రితం సైనిక పాఠశాల మంజూరైందని, 2017లో సైనిక్ స్కూల్ సొసైటీతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం సైతం కుదుర్చుకుందని గుర్తుచేశారు. సైనిక్ స్కూల్ ఏర్పాటుకు వరంగల్ జిల్లా ధర్మసాగర్ మండలం ఎలుకుర్తిలో 50ఎకరాలు సేకరించినా అడుగు ముందుకు పడలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీలోని కోరుకొండ, కలికిరి సైనిక పాఠశాలల్లో అడ్మిషన్లకు రక్షణశాఖ నిబంధనలను ఇటీవల మార్చడంతో రాష్ట్ర విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఏప్రిల్ 5 పరీక్ష రాసిన తెలంగాణ విద్యార్థులు మరో నాలుగు రోజుల్లో ఫలితాలు వెల్లడికానున్న తరుణంలో మార్చిన నిబంధనలతో మన విద్యార్థులు స్థానికేతరులంటూ ప్రకటన చేయడం సరికాదన్నారు.



యాచారంలో వాహనదారులతో మాట్లాడుతున్న డీసీపీ సునీతారెడ్డి

ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలి

యాచారం, మే 6(ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనాదారులు హెల్మెట్ తప్పక ధరించాలని మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి వాహనదారులకు సూచించారు. మంగళవారం యాచారంలో వాహనాలు తనిఖీని ఆమె పర్యవేక్షించారు. మద్యం తాగి వాహనాలు నడిపితే ప్రమాదాలు జరుగుతాయని, కారు డ్రైవర్లు సీటు బెల్టు ధరించాలని చెప్పారు. మైనర్లకు వాహనాలిచ్చే తల్లిదండ్రులపై కేసులు నమోదవుతాయని హెచ్చరించారు. ఆమె వెంట సీఐ నందీశ్వర్‌రెడ్డి ఉన్నారు.



భోజనం వడ్డిస్తున్న నర్సింహ, శ్రీనివాస్‌రెడ్డి

రైతు శ్రేయస్సుకే ప్రభుత్వ నిర్ణయాలు

ఆమనగల్లు, మే 6(ఆంధ్రజ్యోతి): రైతుల శ్రేయస్సు కోసం రాష్ట్ర ప్రభుత్వం సాహసోపేత నిర్ణయాలు తీసుకుంటోందని ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆమనగల్లు మార్కెట్ యార్డ్‌లో రైతుల కోసం చైర్‌పర్సన్ యాట గీత సొంత డబ్బు వెచ్చించి ఏర్పాటు చేసిన భోజన కేంద్రాన్ని మంగళవారం వారు సందర్శించారు. మాజీ వైస్‌చైర్మన్ గుర్రం కేశవులు, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు జగన్, బీచ్యానాయక్‌లతో కలిసి రైతులకు భోజనాన్ని వడ్డించారు. చైర్‌పర్సన్ గీతను పలువురు అభినందించారు. ఏఎంసీ డైరెక్టర్ రవీందర్, కాంగ్రెస్ నాయకులు వస్పుల శ్రీకాంత్, హీరాసింగ్, ఫరీద్, కృష్ణయాదవ్ పాల్గొన్నారు.



పనులను ప్రారంభిస్తున్న సురేందర్‌రెడ్డి, నాయకులు

గ్రామీణ రోడ్లకు మహర్దశ

షాబాద్, మే 6(ఆంధ్రజ్యోతి): గ్రామీణ రోడ్లకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పీసరి సురేందర్‌రెడ్డి అన్నారు. ఏట్ల ఎర్రవల్లి వద్ద వాగుపై రూ.2కోట్లతో నిర్మించే బ్రిడ్జి పనులను మంగళవారం ఆయన ప్రారంభించారు. పనులను ముమ్మరంగా చేపట్టి వానాకాలంలోగా పూర్తి చేస్తామని చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే యాదయ్య, కాంగ్రెస్ చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి భీంభరత్‌లకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు నర్సింహులు, శ్రీరాంరెడ్డి, అమరేందర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, కిష్టయ్య, ప్రవీణ్, గ్రామస్తులు పాల్గొన్నారు.



బ్యాంకు మేనేజర్లతో మాట్లాడుతున్న ఎంపీడీవో రవిచంద్రకుమార్‌రెడ్డి

అర్హులందరికీ రుణాలివ్వండి

కేశంపేట, మే 6(ఆంధ్రజ్యోతి): రాజీవ్ యువ వికాసం స్కీంలో భాగంగా దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ రుణాలు ఇవ్వాలని ఎంపీడీవో రవిచంద్రకుమార్‌రెడ్డి బ్యాంకుల మేనేజర్లను కోరారు. మంగళవారం మండల పరిషత్‌లో ఎస్సీ, బీసీ, మైనారిటీ కార్పొరేషన్ అధికారులతో కేశంపేట, నిర్దవెల్లి, వేముల్‌నర్వ కెనరాబ్యాంకు, కొత్తపేట గ్రామీణ వికాస్ బ్యాంకు, కేశంపేట ఎస్బీఐ మేనేజర్లతో సమావేశం నిర్వహించారు. మండలంలో యువ వికాసం పథకానికి 1,673 దరఖాస్తులొచ్చాయని, వీరిలో అర్హులందరికీ రుణాలు ఇవ్వాలని ఎంపీడీవో కోరారు. దరఖాస్తుదారుల జాబితాను బ్యాంకు మేనేజర్లకు అందించారు. ఎంపీవో కిష్టయ్య పాల్గొన్నారు.

బీజేపీ మొయినాబాద్ రూరల్ అధ్యక్షుడిగా చంద్రశేఖర్‌రెడ్డి



మొయినాబాద్ రూరల్, మే 6(ఆంధ్రజ్యోతి): బీజేపీ మొయినాబాద్ రూరల్ అధ్యక్షుడిగా దారెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి నియమితులయ్యారు. కేతిరెడ్డిపల్లికి చెందిన చంద్రశేఖర్ రెడ్డి ఇప్పటి వరకు బీజేవైఎం మండల ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. పార్టీకి ఆయన చేసిన సేవలను గుర్తించిన పార్టీ పెద్దలు రూరల్ మండల అధ్యక్షుడిగా నియమించారు. తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థంగా నిర్వహిస్తానని చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు.



దర్గాకు పూజలు చేస్తున్న రవీందర్

భక్తిశ్రద్ధలతో దర్గా ఉర్సు

షాద్‌నగర్ రూరల్, మే 6(ఆంధ్రజ్యోతి): ఫరూఖ్‌నగర్ మండలం ఉప్పరిగడ్డలో గల మక్తాలో మంగళవారం దర్గా ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. కేశంపేట మాజీ ఎంపీపీ వై.రవీందర్‌యాదవ్ ప్రార్థనలు చేశారు. ఆయన మాట్లాడుతూ.. ఉర్సు ఉత్సవాలు హిందువులు, ముస్లింలు కలిసి జరుపుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మణ్‌నాయక్, చందూ, వీరేశంగుప్తా, రవిగౌడ్ పాల్గొన్నారు.

10 నుంచి లక్ష్మీనృసింహుడి జయంతి ఉత్సవాలు



- ముస్తాబవుతున్న ఆలయం

ఇబ్రహీంపట్నం, మే 6(ఆంధ్రజ్యోతి): ఈ నెల 10వ తేదీ నుంచి మూడు రోజులపాటు జరగనున్న లక్ష్మీనృసింహస్వామి జయంతి, కల్యాణోత్సవానికి ఇబ్రహీంపట్నం ఆలయం ముస్తాబైంది. దేవాదాయ శాఖ, భక్తులు చేస్తున్నారు. ఇబ్రహీంపట్నంతో పాటు పరిసర గ్రామాలు, హైదరాబాద్ ప్రాంతాల నుంచి భక్తులు తరలిరానున్నారు. వసతి, వాహనాల పార్కింగ్‌కు ఏర్పాట్లు చేస్తున్నారు. 10న శనివారం స్వామివారి సుప్రభాత సేవ, మంగళా శాసనం, 11న లక్ష్మీనృసింహ మహాయాగం, సహస్రనామ పారాయణం, రాత్రి స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని జరుపనున్నారు. 12న సోమవారం మహాలక్ష్మీ యాగం, చక్రస్నానం, నివేదన, రమాసత్యన్నారాయణస్వామి వ్రతం, సాయంత్రం రథోత్సవం, ఊరేగింపు, ఆలయ ప్రవేశం, పవళింపు సేవ ఉంటాయని నిర్వాహకులు వివరించారు.



ఇబ్రహీంపట్నం సమీపంలో కొండపై ఉన్న ఆలయం

కోర్కెలు తీర్చే దేవుడని భక్తుల విశ్వాసం



ఇక్కడ వెలిసిన లక్ష్మీనృసింహుడు భక్తుల కోర్కెలు తీరుస్తాడనేది భక్తులకు నమ్మకం. ఒకప్పుడు ఆలయానికి వెళ్లాలంటే దారి కూడా ఉండేది కాదు. ఇప్పుడు నలువైపుల నుంచి మంచి రోడ్లు వేశారు. ఆలయ అభివృద్ధికి దాతలు ముందుకు వస్తున్నందున అనేక కార్యక్రమాలు చేపడుతున్నారు. ఆలయంతో ఈ ప్రాంతానికి మంచి గుర్తింపు వచ్చింది.

- తమ్మళ్ల కృష్ణ, ఇబ్రహీంపట్నం

ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు



ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేస్తున్నాం. ఎండలను తట్టుకునేలా దాతల సహకారంతో కొండపైన చలువ పందిళ్లు, తాగునీటి వసతి, ఇబ్రహీంపట్నం చౌరస్తా నుంచి ఆలయం వరకు లైటింగ్, మైక్ సిస్టం ఏర్పాటు చేస్తున్నాం. స్వామివారి కల్యాణం రోజు రాత్రి వేళ భక్తులకు అన్నదానం నిర్వహిస్తాం.

- మురళీకృష్ణ, ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్

వరి కోతల్లో జాగ్రత్తలు తప్పనిసరి

సరైన సమయంలోనే పనులు చేపట్టాలి ● మేలైన పద్ధతులు పాటిస్తేనే ధాన్యం సురక్షితం

మేడ్చల్ ప్రతినిధి, మే 6(ఆంధ్రజ్యోతి): మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో వరి కోతలు జోరందుకున్నాయి. అయితే పంట చేతికొచ్చినప్పటి నుంచి కోతలు, తర్వాత ధాన్యం నిల్వ చేయడం విషయాల్లో రైతులు అవగాహన పెంచుకోవాలి. కోతల సమయంలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వ్యవసాయాధికారులు ఎప్పటికప్పుడు సూచనలు, సలహాలు ఇస్తున్నారు. కోతకు 15 రోజుల ముందే నీటి తడి నిలిపివేయాలి. చివరి గింజ తయారయ్యే వరకూ వరి కోయరాదు. లేదంటే తాలు వచ్చే ఆస్కారం ఉంది. ఇలే చేస్తే వడ్ల నాణ్యత తగ్గి మంచి ధర రాదు. అలాగే మంచు ఉన్న సమయంలో కోస్తే గింజలు మెత్తబడి నల్లగా మారతాయి. అదే సమయంలో వరి కోతలు ఆలస్యమైతే గింజ పగుళ్లు వచ్చి ధాన్యం నూక అవుతుంది. 80 నుంచి 90 శాతం వరి వెన్నులు పసుపు రంగుకు మారుతున్న సమయంలో పంట కోయాలి. పంట పూర్తిగా ఎండిపోయే వరకు ఉంచకూడదు. అలా చేస్తే వడ్లు నేల రాలుతాయి. ధాన్యంలో పొల్లు ఎక్కువగా చేరుతుంది. సరైన సమయంలో కోస్తే ధాన్యంలో సాధారణంగా 18-20శాతం తేమ ఉంటుంది. గింజలో తేమ శాతాన్ని తగ్గించేందుకు రెండుమూడు రోజులు మెదలు ఎండనివ్వాలి. హార్వెస్టర్‌తో కోస్తే తేమశాతం తగ్గే వరకు వడ్లు ఎండబోయాలి. ఒక వేళ వర్షం వచ్చి పంట తడిస్తే నీటిలో 5శాతం ఉప్పును కలిపి వరిపై పిచికారి చేయాలి. హార్వెస్టర్లతో కోత, నూర్పిడి చేస్తే దుమ్ముధూళి మట్టి పెల్లల కలువకుండా చూసుకోవాలి. కోతల తర్వాత వడ్లను తూర్పార బట్టి చెత్త, మట్టిని వేరుచేయాలి. తూర్పారబట్టిన ధాన్యంలో తేమ 14 నుంచి 12 శాతానికి తగ్గే వరకు ఎండబోయాలి. ఇలా చేస్తే ధాన్యం ఎక్కువ రోజులు నిల్వ ఉంటుంది. అలాగే మంచి రంగుతో చూడగానే ఆకట్టుకునేలా ఉంటుంది. చవుడు నేలలో పండిప ధాన్యాన్ని ఎర్ర నేలలు, రేగడి నేలల్లో పండిన పంటతో కలపకూడదు. చీడపీడలు ఆశించినా రంగుమారకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ధాన్యంలో కలుపు మొక్కల(వెడిపిలి) గింజలు లేకుండా చూడాలి. ధాన్యం నిల్వ చేసేటప్పుడు అధిక తేమ లేకుండా చూసుకోవాలి. ధాన్యాన్ని ఆశించే కీటకాల నుంచి రక్షణ కోసం పరిసరాల్లో పొగబెట్టడం మంచిది. శుభ్రమైన గోనె సంచుల్లో లేదా గుమ్మిలు, కాగుల్లో నిల్వ చేయాలి. ఎలుకలు, సూక్ష్మ జీవులు ఆశించకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ధాన్యం నిల్వ చేసే ప్రదేశం తడి లేకుండా, బస్తాలకు చిల్లులు లేకుండా చూసుకోవాలి. ఆరుగాలం కష్టపడి పండించి ధాన్యం చిన్న పాటి నిర్లక్ష్యం కారణంగా పాడైపోతే నష్టం వాటిల్లుతుంది. చిన్న చిన్న జాగ్రత్తలు తీసుకుంటే ధాన్యం పాడవకుండా ఉంటుంది.



వరి కోస్తున్న హార్వెస్టర్

మడుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు

మడుల్లో ధాన్యం గింజలు పడకుండా చూసుకోవాలి. లేకుంటే తర్వాత పంట సమయంలో ఈ గింజలు మొలిచి పంట కల్తీ అవుతుంది. వరి పొలంలో కంకులు మొత్తం ఎండే వరకు ఆగాలి. పొలం కోసిన తర్వాత కలుపు, ఇతర మొక్కలు ఉంటే తీసివేయాలి. ఇలా చేస్తే వచ్చే పంటలో కలుపు మొక్కల శాతాన్ని గణనీయంగా తగ్గించుకోవచ్చు.

అధికారుల సూచనలు పాటించాలి



రైతులు వరి కోతల సమయంలో వ్యవసాయాధికారులు చేసే సూచనలు తప్పక పాటించాలి. చిన్న పాటి జాగ్రత్తలతో ఎంతో మేలు జరుగుతుంది. ధాన్యంతో పాటు పొలం మడులపై కూడా పలు జాగ్రత్తలు తీసుకోవాలి. కోతలు పూర్తయిన తర్వాత ధాన్యాన్ని ప్రభుత్వ కొనగోలు కేంద్రాలకే తరలించాలి. ప్రైవేట్ వ్యాపారులకు వడ్లు అమ్మి రైతులు మోసపోవద్దు.

- చంద్రకళ, జిల్లా వ్యవసాయాధికారి



ధాన్యాన్ని కుప్పగా పోస్తున్న యంత్రం

సబితకు భారీ ఉపశమనం

(ఐదో పేజీ తరువాయి)

కేసు నమోదు చేసిన సీబీఐ 2014 ఏప్రిల్‌లో సబితారెడ్డిని నిందితురాలిగా చేర్చుతూ కోర్టులో అభియోగ పత్రం దాఖలు చేసింది. అప్పటి నుంచి ఆమె రాజకీయ ఒడిదుడుకులు ఎదుర్కొంటూనే ఉన్నారు. రాష్ట్రంలో, కేంద్రంలో కాంగ్రెస్‌లో అధికారంలో ఉన్నప్పటికీ ఆమె ఈ వివాదం నుంచి బయటపడలేకపోయారు. చివరకు 2014లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆమెకు కాంగ్రెస్ పార్టీ టికెట్ కూడా నిరాకరించింది. అయితే అప్పట్లో ఆమెకు ఉమ్మడి జిల్లాలో పట్టుఉండడంతో ఆమె స్థానంలో కుమారుడు కార్తీక్‌రెడ్డికి చివరి క్షణంలో చేవెళ్ల పార్లమెంట్ టిక్కెట్ ఇచ్చింది. ఆ ఎన్నికల్లో కార్తీక్‌రెడ్డి ఓటమి చెందడంతో ఆమెకు రాజకీయంగా దెబ్బతగిలింది.

తీర్పు పట్ల ఆనందం

ఆ తరువాత 2019లో జరిగిన ఎన్నికల్లో సబితారెడ్డికి కాంగ్రెస్ మహేశ్వరం టిక్కెట్ ఇచ్చింది. ఈ ఎన్నికల్లో విజయం సాధించిన ఆమె తర్వాత కాలంలో అప్పటి అధికార బీఆర్ఎస్‌లో చేరి మంత్రివర్గంలో స్థానం కూడా పొందారు. 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మహేశ్వరంలో బీఆర్ఎస్ నుంచి పోటీ చేసి విజయం సాధించారు. కాగా, కోర్టు తీర్పుపట్ల సబితారెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. ఈ కేసు వల్ల రాజకీయంగా, వ్యక్తిగతంగా ఎన్నో అవమానాలు పడాల్సివచ్చిందని కోర్టు తీర్పుతో న్యాయవ్యవస్థపై మరింత నమ్మకం పెరిగిందన్నారు.

అభిమానుల సంబరాలు

సీబీఐ కోర్టు సబితారెడ్డిని నిర్దోషిగా ప్రకటించడంతో సబితారెడ్డి అభిమానులు, బీఆర్ఎస్ శ్రేణులు ఉమ్మడి జిల్లాలో సంబరాలు జరుపుకున్నారు. నగరంలోని సబితారెడ్డి ఇంటి వద్ద, మీర్‌పేటలోని పార్టీ కార్యాలయం వద్ద బీఆర్ఎస్ శ్రేణులు టపాసులు కాల్చి, స్వీట్లు పంచుకున్నారు. మహేశ్వరం నియోజకవర్గంలోని మీర్‌పేటలో సబితారెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.

ఆర్అండ్ఆర్ చట్టం ప్రకారమే రైతులకు పరిహారం

ఆదిభట్ల, మే 6(ఆంధ్రజ్యోతి): ఆర్అండ్ఆర్ చట్ట ప్రకారమే రైతులకు పరిహారం చెల్లించి గ్రీన్ ఫీల్డ్ రోడ్డు నిర్మాణం చేపడుతామని రంగారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్ ప్రతిమాసింగ్ పేర్కొన్నారు. మంగళవారం ఆదిభట్ల మున్సిపల్ పరిధి కొంగరకలాన్‌లో భూసేకరణ స్పెషల్ అధికారి రాజు అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించారు. సభకు హాజరైన అదనపు కలెక్టర్ నిర్వాసితుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రీన్ ఫీల్డ్ రోడ్డులో భూమి కోల్పోతున్న కోశిక కోటయ్య, మల్లయ్య తదితర రైతులు అధికారికి సమస్యలను విన్నవించుకున్నారు. గత ప్రభుత్వంలో కొంగర కలాన్‌లోని సర్వే నంబరు 300 కేన్స్ కంపెనీకి భూసేకరణ చేసినప్పుడు 8ఎకరాలు పోగా కానీ ఇప్పటి వరకు పరిహారం ఇవ్వలేదన్నారు. పరిహారం కోసం ఆర్డీవో, కలెక్టర్ కార్యాలయాల చుట్టూ తిరిగినా ఫలితం లేదని ప్రతిమాసింగ్‌కు తెలిపారు. ఇప్పుడు సర్వే నంబర్ 289, 290, 291, 298లలో తమకున్న ఉన్న 5ఎకరాల్లో రోడ్డుకు 2ఎకరాల 10గుంటలు పోతుందని వివరించారు. అధికారులు రోడ్డు సర్వే సరిగా చేయడం లేదని, భూస్వాముల భూములు గుంటల్లో పోతే తమది మాత్రం ఎకరాల్లో పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం పునరాలోచించి పట్టా భూముల్లో నుంచి కాకుండా ప్రభుత్వం భూముల్లోంచి రోడ్డు వేయాలని కోరారు. సాగు భూమిలో హద్దురాళ్లు పెట్టడం సరికాదని అన్నారు. కలెక్టర్ చొరవ తీసుకొని న్యాయం చేయాలని కోరారు.

ప్రజాభిప్రాయం మేరకే భూసేకరణ ...

ప్రజాభిప్రాయం మేరకే గ్రీన్ ఫీల్డ్ రోడ్డుకు భూమిని సేకరిస్తామని అడిషనల్ కలెక్టర్ ప్రతిమాసింగ్, భూసేకరణ స్పెషల్ కలెక్టర్ రాజు తెలిపారు. నిర్వాసిత రైతుల, కుటుంబాల పూర్తి సమాచారం సేకరించామన్నారు. కొంగరకలాన్, ఫిరోజ్‌గూడ పరిధిలో 42మంది రైతుల నుంచి 55ఎకరాల 7గుంటల భూమి సేకరిస్తామన్నారు. ప్రస్తుత మార్కెట్ విలువకు మూడు రెట్లు పరిహారం చెల్లిస్తామని తెలిపారు. నిర్వాసిత కుటుంబంలో 18ఏళ్లు నిండిన ప్రతీ వ్యక్తికి రూ.5లక్షల చొప్పున పరిహారం, ఆర్అండ్ఆర్ చట్టం ప్రకారం ఇవ్వాల్సిన వసతులన్నీ కల్పిస్తామన్నారు. రైతులు ఆందోళన చెందకుండా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో అధికారులు విజయ్‌కుమార్, తారకేశ్వర్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం డీటీ శ్రీనివాస్, ఆర్ఐ పుష్పలత, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ ప్రతిమాసింగ్

నృత్యంలో విద్యార్థినికి ద్వితీయ బహుమతి



విద్యార్థినిని అభినందిస్తున్న జంగిరెడ్డి

కీసర రూరల్, మే 6(ఆంధ్రజ్యోతి): డార్జిలింగ్‌లో నిర్వహించిన ఎనిమిదో జాతీయ స్థాయి నృత్య, సంగీత చాంపియన్‌షిప్-2025 పోటీల్లో నాగారం మున్సిపాలిటీ సెరినిటీ పాఠశాల పదో తరగతి విద్యార్థిని జాహ్నవి ద్వితీయ బహుమతి సాధించింది. మంగళవారం ఆమె ఇంటికి చేరుకోగా కరెస్పాండెంట్ నోముల జంగిరెడ్డి బాలికను సత్కరించి, అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ వసంత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అక్రమంగా ధాన్యం తరలించకుండా తనిఖీలు



రావుల్‌పల్లి చెక్‌పోస్టు వద్ద ధాన్యం వాహనాలను తనిఖీ చేస్తున్న అధికారులు


కొడంగల్ రూరల్, మే 6 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక నుంచి తెలంగాణ సరిహద్దు కస్తూర్‌పల్లి మీదుగా కొడంగల్ ప్రాంతానికి అక్రమంగా వరి ధాన్యాన్ని తరలించకుండా రావుల్‌పల్లిలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద అధికారులు మంగళవారం తనిఖీ చేశారు. ఏఈవో హెరాల్డ్ ఆధ్వర్యంలో ధాన్యం లోడ్ వాహనాలను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ఇస్తున్న మద్దతు ధర, సన్నవడ్లకు బోనస్ పొందేందుకు కర్ణాటక రైతులకు అక్రమంగా ధాన్యాన్ని తరలించకుండా చెక్‌పోస్టు వద్ద తనిఖీలు చేస్తున్నట్టు తెలిపారు. తనిఖీల్లో పోలీసు సిబ్బంది శంకర్, శ్రీకాంత్, రెవెన్యూ సిబ్బంది హనుమంతు, అంజిలప్ప పాల్గొన్నారు.

ఆధునిక పద్ధతుల్లో సాగు చేయాలి

కొడంగల్ రూరల్, మే 6(ఆంధ్రజ్యోతి): ఆధునిక పద్ధతుల్లో పంటలు సాగుచేసుకోవాలని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త లక్ష్మణ్ అన్నారు. పర్సాపూర్ రైతు వేదికలో మంగళవారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఎరువుల వాడకంపై రైతులు అవగాహన కలిగి ఉండాలన్నారు. రసాయన ఎరువులు ఎక్కువ వాడితే నేల సహజత్వాన్ని కోల్పోతుందని చెప్పారు. కార్యక్రమంలో తాండూర్ వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త రాజేశ్వర్‌రెడ్డి, కొడంగల్ ఏడీఏ శంకర్‌రాథోడ్, ప్యాక్స్ చైర్మన్ కె.శివకుమార్‌గుప్తా, మార్కెట్ కమిటీ చైర్మన్ అంబయ్యగౌడ్, ఏవో తులసి, ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శాస్త్రవేత్త లక్ష్మణ్



పార్టీ అధ్యక్షురాళ్లతో ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

మహిళాభ్యున్నతికి ప్రభుత్వం కృషి

పరిగి, మే 6(ఆంధ్రజ్యోతి): మహిళల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. పరిగిలోని తన నివాసంలో మంగళవారం కొత్తగా కాంగ్రెస్ పార్టీ పరిగి బ్లాక్-1 అధ్యక్షురాలిగా సురేఖారెడ్డి, మండల అధ్యక్షురాలిగా బి.రజితారెడ్డి, పట్టణ అధ్యక్షురాలిగా రజితారెడ్డిలను నియమించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు పార్థసారథి, నాయకులు అంజనేయులు, చిన్ననర్సింహులు, వెంకటేశ్ పాల్గొన్నారు.

ఇంటర్ ర్యాంకర్‌కు సన్మానం

ఇంటర్ ఫలితాల్లో స్టేట్ మూడో ర్యాంకు సాధించిన విద్యార్థినిని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి సన్మానించారు. పరిగికి చెందిన బోయిని సాయితన్మయి ఇంటర్ సెకండియర్‌లో 994 మార్కులు సాధించింది. బాలికను ఎమ్మెల్యే అభినందించారు.

అర్హుల ఎంపిక పారదర్శకంగా చేపట్టాలి

కందుకూరు:రాజీవ్ యువ వికాసం పథకానికి లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా చేపట్టాలని ఎండీవో సరిత కోరారు. బ్యాకుల మేనేజర్లు, వెల్ఫేర్ కార్పొరేషన్ల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడారు. మండలంలో బీసీలు 1,064 మంది, ఈబీసీలు 40, ఎంబీసీలు 7, ఎస్సీలు 671, ఎస్టీలు 220, మైనార్టీలు 105, ఇతరులు ఇద్దరు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. దరఖాస్తుదారుల సిబిల్ స్కోర్ బాగున్న వారి జాబితాలను మండల పరిషత్‌లో అందజేయాలన్నారు. ఎంపీవో గీత, ఏపీఎం కవిత, వివిధ బ్యాంకుల మేనేజర్లు పాల్గొన్నారు.

సిద్ధమవుతున్న 'యూనిఫాం'

(5వ పేజీ తరువాయి)

కలుపుకొని 1,341 ఉన్నాయి. 1,38,969 విద్యార్థుల కోసం 5,94,751 మీటర్ల వస్త్రం ఇప్పటికే జిల్లాకు చేరుకుంది. మొదటి విడతలో ప్యాంటు వస్త్రం మాత్రమే రాగా, స్వయం సహాయక సంఘాల మహిళలకు కుట్టేందుకు అప్పగించారు. మిగతా వస్త్రం వచ్చేలోగా ప్యాంట్ల తయారీ పనులు పూర్తి చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. జిల్లాలో మేడిపల్లి, యాచారం, మాల్, గుంగల్, నందివనపర్తిలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో యూనిఫాం కుట్టు పనులు వేగంగా జరుగుతున్నాయి.

6, 7 తరగతులకు కూడా..

ఇదివరకు 8-12 తరగతుల బాలురకు మాత్రమే ఏకరూప దుస్తుల్లో ప్యాంటు అందించేవారు. విద్యాశాఖ తాజా నిర్ణయం మేరకు.. వచ్చే విద్యా సంవత్సరం నుంచి 6, 7 తరగతుల బాలురలకు కూడా నిక్కరు కాకుండా ప్యాంటు అందించనున్నారు. ప్రస్తుత కాలంలో 7వ తరగతిలోనూ పిల్లలు నిక్కరు తొడగడం సరికాదని తల్లిదండ్రులు విమర్శిస్తూ వచ్చారు. తమకు నిక్కర్లు వద్దని విద్యార్థులు చాలా మంది తీసుకునే వారు కాదు. దానికి బదులు వస్త్రం ఇస్తే ప్యాంటు కుట్టించుకుంటామని విజ్ఞప్తి చేశారు. తాజా నిర్ణయంతో విద్యార్థుల్లో సంతోషం వ్యక్తమవుతోంది.

కొలతలు పక్కాగా..

ఈ సారి ఏక రూప దుస్తుల తయారీలో ముందు జాగ్రత్తగా చర్యలు తీసుకున్నారు. గతంలో తరగతి వారీగా కొలతలు తీసుకొని దుస్తులు తయారు చేసే వారు. దీంతో కొందరికి పొట్టిగా, బిగుతుగా ఉండేవి. ఒక్కోసారి మరీ వదులుగా ఉండేవి. ప్రస్తుతం తరగతి వారీగానే కా కుండా విద్యార్థులవారీగా కొలతలు తీసుకున్నారు. ఈనెలాఖరు వరకు క నీసం ఒక్క జతైనా విద్యార్థికి అందజేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

బడులు తెరిచేనాటికే అందజేస్తాం



పాఠశాలలు పునఃప్రారంభించే నాటికి విద్యార్థులందరికి రెండు జతల ఏక రూప దుస్తులను పంపిణీ చేసేందుకు చరలు తీసుకుంటున్నాం. ఇప్పటివరకు 5,94,751 మీటర్ల వస్త్రం వచ్చింది. దాన్ని మహిళా సంఘాలకు అందజేశాం. త్వరగా ఏకరూప దుస్తులు కుట్టేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

- సుశీంద్రరావు, జిల్లా విద్యాధికారి

నిరుపయోగంగా నీటి ట్యాంకులు

- కొన్నేళ్ల క్రితం నిర్మాణం.. నేడు పనికిరాని వైనం
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు
- వినియోగంలోకి తేవాలి : బస్తీ, కాలనీవాసులు



శిథిలావస్థలో మధురానగర్‌లోని నీటి ట్యాంకు



సునేర్‌గల్లీలోని నీటి ట్యాంకు ఇలా..



నిరుపయోగంగా మంగళిబస్తీలోని ట్యాంకు

శంషాబాద్, మే 6(ఆంధ్రజ్యోతి): ప్రజలకు తాగునీరు అందించడానికి ప్రభుత్వం శంషాబాద్‌లో కొన్నేళ్ల క్రితం నిర్మించిన పెద్ద, చిన్న నీటి ట్యాంకులు ప్రస్తుతం నిరుపయోగంగా మారాయి. శంషాబాద్ మున్సిపాలిటీగా ఏర్పడకముందు మేజర్ గ్రామపంచాయతీగా ఉండేది. ఆ సమయంలో గ్రామంలోని వివిధ కాలనీలు, బస్తీలలో ప్రజలకు తాగు నీరు అందించేందుకు వాటర్ ట్యాంకులు నిర్మించారు. అయితే, అవి ప్రస్తుతం ఎందుకూ పనికి రాకుండా ఉన్నాయి. ఎరుకలిగడ్డలో పెద్ద నీటి ట్యాంకు నిర్మాణంతో పాటు పలు బస్తీల్లో చిన్న చిన్న నీటి ట్యాంకులు నిర్మించారు. ఇలా దాదాపు 60 ట్యాంకులు ప్రజల అవసరార్థం నిర్మించారు. ఇకపోతే వివిధ బస్తీల్లో చిన్న నీటి ట్యాంకులు నిర్మించి గ్రామంలోని పలు చోట్ల వేసిన బోరుబావుల ద్వారా ట్యాంకులకు ప్రత్యేకంగా పైపులైను నిర్మించి నీరందించే వారు. వాటికి కులాయిలు అమర్చి నీరు సరఫరా చేసేవారు. ఇక ఎరుకలిగడ్డలో ఏర్పాటు చేసిన పెద్దనీటి ట్యాంకు ద్వారా వివిధ బస్తీల్లో ఏర్పాటుచేసిన ఇంటి నల్లాలకు నీరు సరఫరా చేసేవారు. కాలక్రమేనా శంషాబాద్‌కు కృష్ణా జలాలు సరఫరా అయ్యాయి. పహాడీషరీఫ్ ప్రాంతంలోని కృష్ణాజలాల ప్రధాన పైపులైను ద్వారా మామిడిపల్లి, ఎయిర్‌పోర్టు రోడ్డు గుండా ధర్మగిరి వద్దకు ప్రత్యేకంగా పైపులైను నిర్మించి ధర్మగిరి ప్రాంతంలో పెద్ద సంపు నిర్మించి అక్కడ నీరు స్టోర్ చేసేవారు. అక్కడి నుంచి ఎరుకలిగడ్డలో ఉన్న పెద్దనీటి ట్యాంకులో నింపి దాని ద్వారా వివిధ బస్తీల్లో ఏర్పాటు చేసిన నల్లాలకు నీరు సరఫరా చేసేవారు. ఇక కృష్ణా నీరు మరి కొంత కాలం తరువాత ఎరుకలిగడ్డ బస్తీ నుంచి కాపుగడ్డ, యాదవ్‌బస్తీల గుండా రైల్వేగేటు పక్క నుంచి సిద్దాంతి బస్తీలో పెద్ద నీటి ట్యాంకు వరకు పైపు లైను ప్రత్యేకంగా నిర్మించి దాని ద్వారా సిద్దాంతి బస్తీ, మధురానగర్, ఆర్బీనగర్, ఆదర్శనగర్ బస్తీలలోని ఇంటి నల్లాలకు నీరు సరఫరా చేస్తున్నారు. అయితే, శంషాబాద్ మున్సిపాలిటీగా ఏర్పడ్డాక ఇటీవల కాలంలో హుడాకాలనీలో కొత్తగా ఎక్కువ సామర్థ్యం గల పెద్దనీటి ట్యాంకు సంపు నిర్మించారు. ఆ ట్యాంకులో నీరు నింపి సరఫరా చేయనున్నారు. అది వినియోగంలోకి వస్తే శంషాబాద్‌లో తాగునీటి ఎద్దడి ఉండదని స్థానికులు భావిస్తున్నారు.

ట్యాంకులను వినియోగంలోకి తేవాలి



శంషాబాద్ మున్సిపాలిటీలో నీటి సరఫరా కోసం నిర్మించిన చిన్న, పెద్ద నీటి ట్యాంకులను తక్షణమే వినియోగంలోకి తేవాలి. ఆ ట్యాంకుల నీటి సామర్థ్యం మేరకు భవిష్యత్తులో శంషాబాద్ మున్సిపాలిటీలోని వివిధ బస్తీల్లో నీటి ఎద్దడి రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

- వి.గోపాల్, శంషాబాద్ నివాసి



ప్రభాకర్‌రెడ్డిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు, మే 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకుపోవాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పిలుపునిచ్చారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే వారికి తగిన గుర్తింపు ఉంటుందన్నారు. ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల మండలాల నాయకులు మంగళవారం ఎమ్మెల్యే కలిసి స్థానిక సమస్యలను, అభివృద్ధి పనులకు నిధుల మంజూరు గురించి అభ్యర్థించారు. ఇటీవల వడగండ్ల వర్షాలకు పంటలు కోల్పోయి నష్టపోయిన రైతులకు ప్రభుత్వ పరంగా తగిన పరిహారం అందేలా చూడాలని నాయకులు కోరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలకనుగుణంగా పథకాలు రూపొందించి అమలు చేస్తుందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ కార్యక్రమాలు చురుగ్గా నిర్వహిస్తున్న మాజీ జడ్పీటీసీ ప్రభాకర్‌రెడ్డిని ఎమ్మెల్యే సన్మానించారు. ఆమనగల్లు మాజీ మార్కెట్ చైర్మన్ కిషన్‌రెడ్డి, నాయకులు గొర్రె ఓంప్రకాశ్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, తాళ్ల రవీందర్, విజయ్‌రాథోడ్, హన్మనాయక్, సంపత్ కుమార్, నరేశ్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

రైతులందరికీ న్యాయం చేస్తాం : ఆర్డీవో



రైతులతో మాట్లాడుతున్న ఆర్డీవో అనంతరెడ్డి

యాచారం, మే 6(ఆంధ్రజ్యోతి): ఫార్మాసిటీ కోసం భూమి ఇచ్చిన ప్రతీ రైతును అన్ని విధాలా ఆదుకుంటామని, ప్రతీ ఒక్కరికీ న్యాయం చేసి ఆదుకునేందుకు ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటున్నట్లు ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంతరెడ్డి, తహసీల్దార్ టి.అయ్యప్పలు హామీ ఇచ్చారు. మంగళవారం సాయంత్రం తహసీల్దార్ కార్యాలయంలో నానక్‌నగర్, పల్లెచెల్కతండా, మేడిపల్లి గ్రామాల రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. కబ్జాలో ఉన్న ప్రతీ రైతుకు పరిహారం ఇవ్వడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ఎంక్రోచ్‌మెంట్ దారులను కూడా ఆదుకునేందుకు కలెక్టర్ టీజీఐఐసీ ఎండీ, ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఫెన్సింగ్ పనులను అడ్డుకోరాదని రైతులను కోరారు. త్వరలో ఉన్నతస్థాయి సమావేశం ఏర్పాటు చేసి రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, కోర్టు కేసులున్న భూములకు ఫెన్సింగ్ వేసేది లేదని తేల్చి చెప్పారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ కీర్తిసాగర్, ఆర్ఐలు మురళీకృష్ణ, రామకృష్ణ తదితరులున్నారు.

సేంద్రియ ఎరువులు వాడాలి



యాచారం : మాట్లాడుతున్న డాక్టర్ రాజేశ్వర్

చేవెళ్ల, మే 6(ఆంధ్రజ్యోతి): రైతులు రసాయనిక ఎరువులకు బదులు సేంద్రియ ఎరువులు వాడితే మంచి దిగుబడులు పెరుగుతాయని జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం పర్యావరణ, సహజ వనరుల విభాగం డైరెక్టర్ డాక్టర్ కేపీ వాణి సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు పేరిట రైతు అవగాహన కార్యక్రమం మంగళవారం చన్వల్లి గ్రామంలో నిర్వహించారు. ఆమె పాల్గొని మాట్లాడుతూ విచ్చలవిడిగా రసాయనిక ఎరువులు వాడొద్దని, అవసరం మేరకు యూరియా వాడాలన్నారు. ప్రతీ సంవత్సరం పంట మార్పిడి చేయాలని, సాగునీటిని ఆదా చేయాలని తెలిపారు. హార్టికల్చర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ డి.రజిని, చేవెళ్ల మాజీ వైస్ ఎంపీపీ జంగం శివనందం, ఏవో శంకర్‌లాల్, ఏఈవో రమ్య, రైతులు తదితరులు పాల్గొన్నారు.

మొయినాబాద్ రూరల్ : యూరియా వాడకాన్ని తగ్గించి పర్యావరణానికి హానికరమైన రసాయన ఎరువులు, పురుగు మందుల వాడకాన్ని తగ్గించేందుకు రైతులు కృషి చేయాలని శాస్త్రవేత్తలు అలీబాబా, చిరంజీవి, మండల వ్యవసాయాధికారి అనురాధలు సూచించారు. రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని కనకమామిడి గ్రామంలో నిర్వహించారు. రైతులకు సూచనలు, సలహాలు చేశారు. ఎంపీడీవో సంధ్యారాణి, పీహెచ్‌డీ వ్యవసాయ విద్యార్థులు సమీర, స్నిగ్ధ, ఏఈవో కుమార్ ఉన్నారు.

యాచారం : చీడపీడల నివారణకు సేంద్రియ ఎరువులు వాడుకోవాలని జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్త డాక్టర్ రాజేశ్వర్ రైతులకు సూచించారు. కొత్తపల్లిలో అవగాహన సదస్సు నిర్వహించారు. శాస్త్రవేత్తలు రామకృష్ణబాబు, మండల వ్యవసాయాధికారి రవినాథ్, ఏఈవో రమేష్ పాటు రైతులు పాల్గొన్నారు.

అవగాహన సదస్సులు

షాబాద్ : ఈ నెల 5 నుంచి జూన్ 13 వరకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఏవో వెంకటేశం ప్రకటనలో తెలిపారు. మే 8న లక్ష్మారావుగూడ, సోలిపేట, 16న తిమ్మారెడ్డిగూడ, మద్దూర్, 23న ఏట్లఎర్రవల్లి, హైతాబాద్, 30న మక్తగూడ, పెద్దవేడు, జూన్ 6న రేగడిదోస్వాడ, చందన్‌వెళ్లి, జూన్ 13న తిర్మలాపూర్, రుద్రారం గ్రామాల్లో సదస్సులు నిర్వహించనున్నట్లు ఆయన చెప్పారు.



చేవెళ్ల : మాట్లాడుతున్న డాక్టర్ కేపీ వాణి

దారికొచ్చేనా?

(5వ పేజీ తరువాయి)

రహదారి విస్తరణకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. మీర్‌ఖాన్‌పేటలో సీసీ రోడ్డు వేశారు. బ్రిడ్జి నుంచి యాచారం మండల పరిధిలోని నజ్దిక్‌సింగారం శివారు వరకున్న బీటీ రోడ్డును ధ్వంసం చేసి నాలుగు లేన్ల మట్టిరోడ్డుగా మార్చారు. నజ్దిక్‌సింగారం సమీపంలో రెడీమిక్స్ యంత్రాలు బిగించి మీర్‌ఖాన్‌పేట వద్ద బ్రిడ్జి పనులు చేపట్టారు. బీటీరోడ్డును మట్టిరోడ్డుగా మార్చారు. దీంతో భారీ వాహనాలు వెళ్లే సమయంలో దుమ్ము రేగుతోంది. ఫలితంగా వెనుకవచ్చే ద్విచక్ర వాహనదారులకు దారి కనిపించక అదుపుతప్పి కింద పడుతున్నారు. రోడ్డుకు ఆనుకొని ఉన్న మామిడితోటు, కోళ్లఫామ్‌లు, పంటలు, పశుగ్రాసంపై దుమ్ము పేరుకుపోతోంది. దుమ్ముతో కోళ్లు చనిపోతున్నాయని, పశువులు రోగాల బారిన పడుతున్నాయని, పంటలు దెబ్బతింటున్నాయని బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మూడున్నరేళ్లుగా ఎవరూ పట్టించుకోకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నామని వాపోతున్నారు. ఈ రోడ్డుపై అడుగడుగున గుంతలుండడంతో మీర్‌ఖాన్‌పేట నుంచి నజ్దిక్‌సింగారం గ్రామానికి 10 నిమిషాల్లో వెళ్లాల్సిన బస్సు 45 నిమిషాల సమయం పడుతుందని ఆర్టీసీ డ్రైవర్లు చెబుతున్నారు.

పనుల నుంచి వైదొలిగిన కాంట్రాక్టర్

చేసిన పనులకు ఆర్అండ్‌బీ శాఖ నుంచి రూ.20 కోట్ల బిల్లులు రావాల్సి ఉండగా ప్రభుత్వం చెల్లిగవ్వ ఇవ్వకపోవడంతో కాంట్రాక్టర్ ఉమామహేశ్వర్‌రెడ్డి పనుల నుంచి తప్పుకున్నారు. బిల్లులు ఇవ్వకుండా అధికారులు తిప్పించుకున్నారని, దీంతో తీవ్రంగా నష్టపోయానని ఆర్అండ్‌బీ ఉన్నతాధికారులకు లేఖ రాసి వైదొలిగాడు. దీంతో ప్రస్తుతం ఆ పనులు చేపట్టడానికి ఏ ఒక్క కాంట్రాక్టర్ కూడా ముందుకు రావడం లేదు.

మా గోసను పట్టించుకోండి



మీర్‌ఖాన్‌పేట నుంచి నజ్దిక్‌సింగారం వరకు ఉన్న రోడ్డుపై బీటీ తొలగించి మట్టిరోడ్డుగా మార్చారు. నాలుగు లేన్ల రహదారిగా విస్తరిస్తామని చేపట్టిన పనులు మూడున్నరేళ్లవుతున్నా పనులు మాత్రం సాగడం లేదు. వచ్చిపోయే వాహనాలతో దుమ్ము రేగుతోంది. వేసుకున్న బట్టలు మాసిపోతున్నాయి. పంటలు దెబ్బతింటున్నాయి. మా గోసను అధికారులు పట్టించుకోవాలి.

- బీమహేందర్‌రెడ్డి, రైతు, కుర్మిద్ద



బీటీ రోడ్డును మట్టిరోడ్డుగా మార్చిన అధికారులు

సమ్మెను జయప్రదం చేయాలి



కందుకూరు : సమ్మె నోటీసు ఇస్తున్న ఆశా కార్యకర్తలు

మంచాల/ యాచారం/ కందు కూరు, మే 6(ఆంధ్రజ్యోతి): ఈనెల 20న తలపెట్టిన దేశవ్యాపిత సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ మండల కన్వీనర్ పోచమోని కృష్ణ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈమేరకు ఆశా వర్కర్లతో కలిసి మంగళవారం మంచాల, ఆరుట్ల పీహెచ్‌సీలో మండల వైద్యాధికారికి సమ్మె నోటీసు అందజేశారు. ఆశావర్కర్లు అమృత, కవిత, రజిత, నవనీత, సంతోష, అలివేలు, అమృత, జ్యోతి, యాదమ్మ తదితరులున్నారు. అలాగే నాలుగు లేబర్‌కోడ్‌లను తక్షణమే రద్దుచేసి కార్మికులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ ఈనెల 20న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు స్వప్న, పి.బ్రహ్మయ్యలు ప్రభుత్వాన్ని కోరారు. ఈమేరకు యాచారంలో సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరించారు. నాయకులు చందూనాయక్, నరేందర్‌రెడ్డి, శంకర్, రాములు, జంగయ్య తదితరులున్నారు. అలాగే కేంద్రం కార్మికుల పట్ల కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని, కార్పొరేట్ సంస్థలకు కొమ్ము కాస్తోందని సీఐటీయూ మండల కన్వీనర్ బుట్టి బాల్‌రాజ్ ఆరోపించారు. కందుకూరు, రాచులూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఆశావర్కర్లతో కలిసి సమ్మె నోటీసులను అందజేశారు. ఆశావర్కర్ల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు మేకం సరస్వతి, నాయకురాళ్లు లక్ష్మీదేవి, భాగ్యలక్ష్మి, కవిత, తదితరులు పాల్గొన్నారు.



యాచారం : పోస్టర్ విడుదల చేస్తున్న సీఐటీయూ నాయకులు

శిక్షణ శిబిరాలను వినియోగించుకోవాలి

మొయినాబాద్ రూరల్, మే 6(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం తెలంగాణ రైజింగ్ వేసవి శిక్షణా శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని మొయినాబాద్ మండల విద్యాధికారి మల్లయ్య సూచించారు. ఈమేరకు అజీజ్‌నగర్, కనకమామిడి జడ్పీహెచ్ఎస్‌లు శిక్షణకు ఎంపికైనట్లు తెలిపారు. మంగళవారం అజీజ్‌నగర్ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 1 నుంచి 9వ తరగతి విద్యార్థులకు ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు పలు అంశాల్లో శిక్షణ ఇవ్వడం జరుగుతుందని, ఉదయం అల్పాహారం అందిస్తారని తెలిపారు. శిబిరం ఈ నెల 19వరకు కొనసాగుతుందన్నారు. హెచ్ఎంలు అబ్దుల్‌అమీద్, అరుణ్‌కుమార్, శేఖర్‌రెడ్డి, మాజీ విద్యాధికారి వెంకటయ్య పాల్గొన్నారు.

ఘనంగా హీరాసింగ్ జన్మదిన వేడుకలు



హీరా సింగ్‌ను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఆమనగల్లు, మే 6(ఆంధ్రజ్యోతి): కడ్తాల మండలం మైసిగండి గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, గిరిజన సేవా సంఘం నాయకుడు హీరాసింగ్ జన్మదిన వేడుకలు ఆమనగల్లు పట్టణంలో మంగళవారం మార్కెట్ యార్డ్ ఆవరణలో ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్, యువజన కాంగ్రెస్ నాయకులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. నాయకులతో కలిసి హీరాసింగ్ కేక్‌కట్ చేసి ప్రజలకు పంచిపెట్టారు. పట్టణంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పలుచోట్ల మొక్కలు నాటారు. హీరాసింగ్‌ను కాంగ్రెస్ నాయకులు సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, మాజీ జడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ మాజీ వైస్ చైర్మన్ కేశవులు, కాంగ్రెస్ మండలాధ్యక్షులు జగన్, బీచ్యానాయక్, నాయకులు తాళ్ల రవీందర్, వస్పుల శ్రీకాంత్, ఫరీద్, తులసీరామ్‌నాయక్, నాజర్, రెడ్యా, తదితరులు పాల్గొన్నారు. అలాగే కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

క్రైం కార్నర్

26 తులాల బంగారం.. రూ.2.5 లక్షలు చోరీ

మొయినాబాద్ రూరల్, మే6(ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని దుండగులు 26 తులాల బంగారం, రూ.2లక్షల 50 వేల నగదును ఎత్తికెళ్లిన ఘటన మొయినాబాద్ మున్సిపల్ పరిధి పెద్దమంగళారం వార్డులో చోటుచేసుకుంది. మొయినాబాద్ సీఐ పవన్ కుమార్‌రెడ్డి కథనం మేరకు.. పెద్దమంగళారం గ్రామానికి చెందిన అప్పల హరీష్‌యాదవ్ సోమవారం రాత్రి 9గంటల సమయంలో మొయినాబాద్ మండల కేంద్రానికి పని నిమిత్తం వచ్చాడు. పని కాస్త ఆలస్యమవడంతో మండల కేంద్రంలోనే ఉంటున్న అతడి అన్న సురేష్ యాదవ్ ఇంట్లోనే విశ్రాంతి తీసుకున్నాడు. మంగళవారం ఉదయం 7గంటల సమయానికి ఇంటికి వెళ్లి చూసేసరికి తలుపులు తెరిచి ఉండటాన్ని గమనించి ఇంట్లోకి వెళ్లి చూడగా బెడ్రూంలోని అల్మారాలో 26 తులాల బంగారం, రూ.2లక్షల 50 నగదు కనిపించకపోవడంతో ఖంగుతిన్నాడు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పవన్‌కుమార్ రెడ్డి తెలిపారు. కాగా, గత రెండు నెలలుగా గుర్తుతెలియని దుండగులు వరుసగా చోరీలకు పాల్పడుతూ మొయినాబాద్ పోలీసులకు సవాల్ విసురుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్‌కు తీవ్ర గాయాలు

నందిగామ, మే 6(ఆంధ్రజ్యోతి): లారీని వెనకాల నుంచి డీసీఎం ఢీకొన్న ఘటన మంగళవారం నందిగామ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బైపాస్ రోడ్డులో చోటుచేసుకుంది. డీసీఎం డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. మహారాష్ట్రలోని నాందేడ్‌కు చెందిన షేక్ జావేద్ డీసీఎంలో లోడ్ వేసుకొని నాందేడ్ నుంచి మహబూబ్‌నగర్ జిల్లా, జడ్చర్లకు వెళ్తున్నాడు. ఈక్రమంలో నందిగామ శివారు బైపాస్‌రోడ్డులో ముందు వెళ్తున్న లారీ డ్రైవర్ సడన్‌బ్రేక్ వేయడంతో డీసీఎం వెనకాల నుంచి ఢీకొంది. దాంతో డ్రైవర్ జావేద్‌కు తీవ్రగాయాలు కావడంతో శంషాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. డీసీఎం యజమాని షేక్ అన్సర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

దైవచింతన కలిగి ఉండాలి : ఎమ్మెల్యే

చేవెళ్ల, మే 6(ఆంధ్రజ్యోతి): ప్రజలందరూ దైవచింతన కలిగి ఉండాలని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని దేవుని ఎర్రవల్లిలో మంగళవారం బీరప్ప జాతర నిర్వహించారు. గ్రామస్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేతో పాటు పలువురు నాయకులు హాజరయ్యారు. మున్సిపల్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, మాజీ సర్పంచ్‌లు శ్యామలయ్య, సామ మాణిక్యరెడ్డి, సీనియర్ నాయకులు మాణిక్యరెడ్డి, రాములు, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కె.పాండుయాదవ్, తదితరులున్నారు.



పూజలో ఎమ్మెల్యే యాదయ్య, నాయకులు

సబితమ్మను నిర్దోషిగా ప్రకటించడంపై హర్షం



కడ్తాల్‌లో నిర్వహించిన సంబురాల్లో లక్ష్మీనర్సింహారెడ్డి

కడ్తాల్, మే 6 (ఆంధ్రజ్యోతి): ఓబులాపురం మైనింగ్ కేసులో మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిని సీబీఐ కోర్టు నిర్దోషిగా ప్రకటించడాన్ని హర్షిస్తూ కడ్తాల్ మండల కేంద్రంలో మంగళవారం సాయంత్రం బీఆర్ఎస్ శ్రేణులు సంబరాలు జరుపుకున్నాయి. రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై పెద్దఎత్తున బాణసంచా పేల్చి మిఠాయిలు పంచుకున్నారు. సబితా ఇంద్రారెడ్డికి అనుకూలంగా నినాదాలు చేశారు. మచ్చలేని నాయకురాలని మరోమారు రుజువైందన్నారు. మాజీ ఉపసర్పంచ్ రామకృష్ణ, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ లాయక్ అలీ, గోవర్ధన్, మహేశ్, శేఖర్, యాదయ్య, కృష్ణయ్య, నర్సింహ, మహిళలు పాల్గొన్నారు. అలాగే మీర్‌పేటలోని సబితారెడ్డి క్యాంపు కార్యాలయం వద్ద నాయకులు, కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఒకరికొకరు స్వీట్లు తినిపించుకున్నారు.



మీర్‌పేటలోని క్యాంపు కార్యాలయం వద్ద..

సన్మానం..



ఆమనగల్లు, మే 6 (ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన అండేకార్ యాదిలాల్‌కు మంగళవారం అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. కల్వకుర్తి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో న్యాయవాదులు పాల్గొన్నారు. బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు యాదిలాల్‌ను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు.



మౌనం పాటిస్తున్న న్యాయవాదులు

న్యాయమూర్తి జస్టిస్ గిరిజా ప్రియదర్శినికి నివాళి

షాద్‌నగర్, మే 6(ఆంధ్రజ్యోతి): తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గిరిజా ప్రియదర్శిని మృతికి సంతాపంగా షాద్‌నగర్ బార్ అసోషియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం బార్ కార్యాలయంలో నివాళులర్పించారు. ఆమె మృతికి సంతాప సూచకంగా రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. బార్ అసోషియేషన్ అధ్యక్షుడు నర్వ వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి గుండుబావి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు రాజశేఖర్ రాజు, న్యాయవాదులు దొడ్డి శ్రీనివాస్, చిన్నస్వామి, పాతపల్లి సురేందర్ రెడ్డి, రూప్‌సింగ్, శ్రీశైలం, ఇంజమూరి నర్సింలు, శ్రీనివాసమూర్తి, శ్రీకాంత్, ఖలీల్, నరేందర్‌నాథ్, కె.శ్రీశైలం, దండు రామస్వామి, మణికంఠ, టి.శ్రీను, పబ్బె శ్రీశైలం, డి.రమేష్, మర్రి శంకరయ్య, శ్రీనివాస్, గోపాలాచారి, ప్రశాంత్, సురేష్, వై.శేఖర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



శంషాబాద్ రూరల్ : సమ్మేళనంలో టీచర్లు, విద్యార్థులు

షాబాద్, మే 6(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల(షాబాద్)లో 1989-90 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు మంగళవారం మండల పరిధిలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో కలుసుకొని తీపి జ్ఞాపకాలు పంచుకున్నారు. రిటైర్డ్ టీచర్స్ వీరస్వామి, యాదగిరి, నరసింహారావు, అడివప్పా, పురుషోత్తం, పూర్వవిద్యార్థులు నర్సింహులు, శ్రీశైలం, దండు మదన్‌గుప్తా, జగదీశ్వర్, మల్లేష్, శ్రీనివాస్, శివకుమార్ గుప్తా, మంజుల, కుసుమకుమారి, అంజి, శివ, అంజనేయులు, రాములు, రమాదేవి తదితరులుపాల్గొన్నారు.

నర్కూడ జడ్పీహెచ్ఎస్‌లో..

శంషాబాద్ రూరల్ : మండల పరిధిలోని నర్కూడ జడ్పీహెచ్ఎస్‌లో 1999–2000 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు మంగళవారం బ్యూటీ గ్రీన్‌లోని బైద్రిల్ ఫామ్‌హౌజ్‌లో ఆత్మీ య సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. 25 సంవత్సరాల తరువాత ఒకే వేదికపై తమకు పాఠాలు చెప్పిన గురువులను శాలువాలతో సత్కరించారు. ఆనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. అప్పటి ప్రధానోపాధ్యాయురాలు పద్మ, ఉపాధ్యాయులు పుష్పలీల, ఉమామహేశ్వరి, బల్లెపు చంద్రశేఖర్, బి.ఈశ్వరయ్యలను సత్కరించి మెమొంటోలు అందజేశారు. ఉపాధ్యాయుల ఆశీర్వాదం తీసుకున్నారు. సున్నిగంటి సిద్దులు, కె.వెంకటేష్‌గౌడ్, ఎం.వెంకటేష్, కూరగాయల కృష్ణ, ఎన్‌జే శ్రీనివాస్, ఎన్.రమేష్, ఎస్ఎస్ రాజు, ఎన్.రమేష్, మహేష్, కమ్రుద్దీన్, ఎం.సంజీవ, తదితరులు పాల్గొన్నారు.



షాబాద్ : ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు